# తెలుగు వాణి

http://www.austintelugu.org/teluguvani.html e-mail: austinteluguvani@yahoogroups.com

**అధ్యక్షుడు**
*సత్యనారాయణ రావు*

**కార్యదర్శి**
*హరి మద్దూరి*

**కోశాధికారి**
*జగన్నాథ్ వేదుల*

**కార్యవర్గం**
*హేమలత నెల్లిమర్ల*
*మురళి బలిజేపల్లి*
*రామారావు గోరుగంతు*
*సత్య డొక్కా*
*శ్రీలత భాగవతుల*

**యూ. టీ. ప్రతినిధి**
*కళ్యాణ్*
*వాజపేయాజుల*

**మెంబర్ డేటాబేస్**
*విక్రాంత్ రుత్తల*

**తెలుగు వాణి**
**సంపాదకుడు**
*రామ్ డొక్కా*

**తెలుగుబడి నిర్వహణ**
*సత్యం మందపాటి*

* * *

***TELUGU CULTURAL ASSOCIATION***
(Conceived in 1990 & Incorporated in 1998)
7301 Burnet Road,
Ste.# 102, PMB #187
Austin, TX 78757

మార్పు సహజం - పరిసరాలకీ, పరిస్థితులకీ, మనుష్యులకీ. ఉదాహరణకి పరిసరాల విషయమే తీసుకొందాం. మన చిన్ననాటి అల్లర్ల విశేషాలూ, మనం నివసించి, చరించిన ప్రదేశాలూ, మన అనుభవాలూ, అనుభూతులూ అన్నీ, కాలం గడిచిపోయాకే మనకెంతో విలువైనవిగా అనిపిస్తాయి. నిజానికి అవి జరుగుతున్నప్పుడు కొందరైనా "ఇటువంటి సమయం మళ్ళీ రాదురా" అని మనకి చెప్పే వుంటారు, అయినా అప్పుడు వాటిని మనం అంతగా ఆనందించామా? అని ప్రశ్నించుకొన్నప్పుడు, వాటిని మన జ్ఞాపకాల చట్రంలో బంధించి, కొన్ని వత్సరాల తరువాతనో, దశాబ్దాల తదుపరినో తిరిగి చూడడం వల్లనే వాటి "విలువ" మరింత పెరిగిందన్న నిజం మనకు బోధపడుతుంది. మనం పుట్టి పెరిగిన ఇళ్ళూ, వాకిళ్ళూ ఇప్పుడు చేతులు మారి వాటి రూపురేఖలు పూర్తిగా మారిపోయి ఉండవచ్చు. మనం ఆడుకొన్న స్థలం కనుమరుగై, దానిపై నేడెన్నో ఉన్నత భవంతులు నిలిచియుండవచ్చు. కానీ, మన జ్ఞాపక చట్రం లో మాత్రం, నాటి అనుభవాలను మనం ఎప్పటికీ గొప్పవిగానే పదిలపరచుకొంటాం. నాటి అనుభూతులు మంచివైనపుడు, ఆ జ్ఞాపకాల విలువ కాలం గడిచే కొద్దీ మరిన్ని రెట్లవుతుంది. నేటికీ, ఆయా పరిసరాలు అచ్చం అప్పటిలాగే ఉండాలని తహతహలాడతాం, ఉంటే సంతోషిస్తాం, తీరా లేకపోతే చాలా బాధపడతాం. పరిసరాలకు సంబంధించి, మన "జ్ఞాపకాల విషయం"లో మనం మార్పును సహించలేం. అవి మారితే ఒప్పుకోం.

ఇక పరిస్థితుల ప్రభావం మన అనుభవాలపై, మన జ్ఞాపకాలపై చాలా ఎక్కువగా వుంటుంది. ఇద్దరు వ్యక్తులు, ఒకే కాలంలో ఒకే రకమైన అనుభవాలను కలిసి రుచి చూసినప్పటికీ, వారి వారి జ్ఞాపకాల చట్రాలలో, ఒకరి "మధురానుభూతులు" మరొకరికి "దుఃఖపూరితాలు"గా వుండవచ్చు. దుఃఖసంద్రంలో ఉన్నవాడు పరిస్థితులు మారాలని ఎంతగా కోరుకొంటాడో, సుఖసంపదలననుభవిస్తున్నవాడు, మార్పును అంతగానూ ఏవగించుకొంటాడు. కానీ పరిసరాల విషయంలో మార్పు ఎంత సహజమో, పరిస్థితుల విషయంలోనూ అంతే సహజం కదా.

అలాగే మనుష్యుల విషయం లోనూ.. ఒక్కొక్క సారి, మనకు బాగా తెలుసుననుకొన్న వాళ్ళే, వివిధ పరిస్థితుల్లో, మనం ఊహించిన దానికన్నా భిన్నంగా ప్రవర్తిస్తూ ఉండడం గమనిస్తుంటాం. అంటే, వారిని మనం కొంత మాత్రమే అర్థం చేసుకొని, మిగిలినదంతా "అంచనా" వేశామనేగా అర్థం. మన "అంచనాల ప్రపంచం"లో కూడా మనం మార్పును భరించలేం. దాంతో ఎన్నో ఆశ నిరాశలకు లోనవుతాం. కాలం మారిపోయిందని నిందిస్తాం. కాలంతోబాటు మంచివారు చెడ్డవారిగా మారిపోయారని వాపోతాం. నేటి ప్రాపంచిక జీవన విధానానికి అనుగుణంగా ప్రతి విషయాన్నీ తార్కిక వాదంతో ముడిపెట్టి సమాధాన పడడమూ, మనకు తారసపడిన ప్రతి వ్యక్తినీ కేవలం మన అనుభవాల ద్వారానో, కొన్ని సందర్భాలలో ఆతని లేదా ఆమె యొక్క ప్రవర్తన, ప్రతిస్పందనలకు అనుగుణంగానో "విలువ కట్టడం", లేదా "అంచనా వేయడం" అనేది మాత్రం మానం.

అసలు మార్పు అనేదే లేకపోతే, ప్రగతి ఎక్కడుంది? ముందుగానే ఒక తప్పుడు అంచనా వేసుకొనో లేక మనసులో మరో రకంగా తీర్మానించేసుకొనో, మన రెక్కలను మనమే ఉత్తరించేసుకొంటే, మార్పుకు అవకాశమెక్కడిది? నిజానికి, మన అభిప్రాయాలలోనూ, నిజజీవితాలలోనూ మార్పును సహజంగా, సంతోషంగా స్వాగతించడం అలవరచుకోవాలి. అందుకోసం ఆశావాదాన్ని మన అణువణువునా నింపుకోవాలి. దానిని మన మాటల్లోనూ, చేతల్లోనూ ప్రతిబింబింపచేయాలి. ఈ విషయంలో ప్రకృతినుండి మనం చాలా నేర్చుకోవాలి. పాడిన పాటనే పదే పదే పాడడమెందుకని ఎలకోయిల మానేస్తుందా?, వసంతం వచ్చి రాగానే నింగి సంద్రాన్ని నూతన స్వరచంద్రికలతో ముంచెత్తదూ? నిరుడు పూచిన తరువులు ఈ సారికి మానేద్దాం లెమ్మని ఉస్సురని ఊరుకొంటాయా?, ఊహల శాఖలను ఆశల చివురులెత్తవూ? అలాగే, అందరం కలిసి ఆహ్లాదంగా, ఆనందంగా మంచి మార్పును కోరుతూ, "స్వభాను" సంవత్సరాహ్వానానికి నూతన భావ తోరణాలు కడదాం, ఏమంటారు?

**అందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలతో..** **- రామ్ డొక్కా**

## Telugu Cultural Association, Austin – past, present and the future

**- Satya Rao, President, 2003 Executive Committee.**

We've come a long way since establishing the Telugu Cultural Association here in Austin. Back in 1990 – 1991 there were about 30 Telugu families who used to meet in a club house of an apartment complex to celebrate our festivals with potluck dinners. As the number of Telugu people in Austin increased, it was thought that we establish a formal association to promote Telugu cultural activities and to provide a platform for encouraging the local Telugu talent. Thus, TCA Austin was born in 1991 with Shri. Rangarao Vemuganti as the first TCA president and had 12 eventful and glorious years ever since.

We now have almost "Aru vaMdala AMdhrula kuTuMbAlu" in Austin. TCA membership has grown to about 300, with 60+ life members. I know there are more out there that are not part of TCA yet. I urge each and every Telugu Austinite to join TCA and support its activities. I get so excited when I see people with so many creative talents - writers, singers, musicians, actors etc. right among us. I'm glad that we have a means to showcase our talents and these talented young artists are coming forward to perform in TCA programs making the job of the Executive Committee much simpler. We only need to work on planning and facilitating the programs rather than trying to search for items and performers. That is a welcome change. I'm very confident that it is only going to get better as more young and talented Telugu people move into our beautiful home away from home – Austin and join our Association.

Going forward, I think, we all need to make sure that the interest and enthusiasm for Telugu culture and arts is not just limited to first generation of pravAsAMdhrulu. It is the responsibility of every person of Telugu origin to involve the children and keep it interesting and entertaining for them. It would be great if our children born and brought up here can read and write Telugu which enables them to learn more about our culture, our literature and our arts. I must congratulate Satyam Mandapati garu for his efforts in trying to teach our children the Telugu language and I think we should make every effort to see that our "Telugu Badi" flourishes again.

Our association upholds Telugu identity and communal harmony in Austin making our cultural indulgence very satisfying. I'm very proud to be associated with TCA, Austin and hope you are too. *****

## బొమ్మ - బొరుసు

*- వీరభద్రశాస్త్రి కాలనాథభట్ట*

ఉగాది వచ్చిందని సంబరమా,
అంబరానికెగసిన కొలంబియా
మండి నేల కూలిందని కలవరమా?
చేతికీ, నోటికీ మధ్య అంతరాయం అరక్షణమా?

లలితరసాల పల్లవఖాదియై
కోకిల నవమధుగీతం పాడింది,
వసంతానికి స్వాగతం పలికింది,
ప్రకృతి అణువణువూ
పులకించింది

అంతరిక్షంలోని అద్భుతాలను
అవగతం చేసుకొన్న
వ్యోమగాములు
నేల చేరకుండావారిని అంతం
చేసింది పోతూ పోతూ హేమంతం

కుసుమవిదులిత పరాగపరిమళం
దశదిశలా అలవోకగా సాగింది
మదనశరాలుగా తాకింది,
శృంగార రసానుభూతిని
నింపింది!

కల్పనా చావ్లా అకాలమరణం
భారతీయులకు చేదు వార్తాశ్రవణం
ఆమె ఇంక లేనే లేదనే భావం
టెర్రరిష్టుల దురాగతాలకన్నా
ఘోరం!!

ఇప్పుడు కొత్త సంవత్సరానికాహ్వానమా?
ఇటు విషాదభరిత గీతికాలాపనా?
అయినా కాల చక్ర భ్రమణం ఆగలేదు
నాందిగా "ఉగాది" రాక మాననూ లేదు..

## శ్రీ స్వభాను

*– చింతామణి శాస్త్రి*
*సవితాల*

సీ. ఋతురాజము వసంతఋతువు వరుడుగాగ,
వధువౌ ప్రకృతి పరవశము జెంద,
తేటి మూకలకు పూదేనియలందించి,
మురియు పూల కనగ ముదము గలుగు
చిన్నార్లు కూయన చెలరేగి యరచెడు,
కోయిలలేరీతి కూయనేర్చె?
ఏ దేశమేగినా తెలుగు పచ్చడి రుచి
మారలేదు, కనుక మరపు రాదు!

గీ. తీపి చేదులను కలిపి తినెడు వేళ ,
కష్ట సుఖముల రెంటిని కలియగలిపి,
అనుభవించుట సృష్టి రహస్యమనుచు,
వచ్చెనిదిగో స్వభాను వత్సరమ్ము! !

# సైన్సు ముందుకి, సమాజం వెనక్కి...

- *రవి మండవ*

కన్వేయరు ఎస్కలేటరు నుంచి మూడవ నంబరు ఫ్లాటుఫార్ము దగర దిగాడు విర. పది వంవత్సరాలలో అప్పటి మద్రాసు-ప్రస్తుతం చెన్నయి, రైల్వేస్టేషను ఎంతో మారిపోయింది అనుకున్నాడు. ఇండియా అంతా బాగా డెవలప్ అయ్యింది. తను అమెరికాలో ఉంటూ పది సంవత్సరాల తర్వాత మాతృభూమి మీద కాలుపెట్టాడు. ఒక రోజు క్రిందట అస్టిను నగరం నుంచి బయలుదేరి, విమానాలలో ప్రయాణించి, చెన్నయి రైల్వేష్టేషనుకు వచ్చాడు. తను వైజాగు వెళ్ళాలి. తల్లి ఆరోగ్యం బాగాలేదని తెలియగానే, తన ఉద్యోగంలో సెలవుపెట్టి ఇక్కడకు వచ్చాడు. మామూలుగా చెన్నయి నుంచి వైజాగుకు, విమానంలో వెళ్ళేవాడు. రెండు సంవత్సరాల క్రిందట, ఇండియాలో ప్రపంచంలోనే మొట్టమొదటసారిగా, నీళ్ళలోవెళ్ళేరైలుని తయారుచేశారన్నవార్త అమెరికా టీవీలో చూసి చాలా గర్వపడ్డాడు. ఈ ప్రయాణంలో నీళ్ళలోవెళ్ళేరైలులో వెళ్ళాలని ముందే నిర్ణయించుకొని, తన ట్రావెల్ఏజెంట్ ద్వారా టికెటు బుక్ చేయించాడు. చెన్నయి నుండి వైజాగుకు వెళ్ళే, ఈ రైలు పేరు "జల వేగము". తను ఐదు నిమిషాలు ఫ్లాట్ఫార్మ్ దగిర వైట్ చేయగానే జలవేగం వచ్చింది. అంతకు ముందు టీవీలో చూసినట్లే మామూలు రైళ్ళలాగా కాక, వేరుగా ఉంది. ముందు కొంచెం విమానంలాగా, ప్రక్కల గ్రేహౌండు బస్సులాగా తళతళ మెరుస్తోంది. దానిక్రింద చక్రాలు లేవు. అయస్కాంత పట్టాలమీద ఆనీ ఆనన్టట్లు ఆగి ఉంది.

ఏడోనంబరు క్యాబిను వెతుక్కుని ఎక్కాడు. డోరు, కిటికీలు అన్నీ ఎయిరు-సీలుగా, టైట్ గా ఉన్నాయి. కిటికీలు 5, 6 అంగుళాల మందంగల గ్లాసులతో చేయబడి ఉన్నాయి. వీటిని తెరవలేము. చిన్నప్పటి లాగా, గాలిలో, బయటకు చేతులుపెట్టలేము అనుకొన్నాడు. తన బెర్తుచూసుకొని, సూటుకేసులు ప్రక్కనే ఉన్నలగేజ్ లాకరులో పెట్టాడు. "మీరు కూడా వైజాగు వెళ్తున్నారా?"- ప్రక్కనే కూర్చుంటున్న యువకుడు అడిగాడు. ఆ యువకునితో పాటు ఇంకా పది మంది యువతీ, యువకులు కూడ వచ్చారు. వెనకనే అప్పుడే పెళ్ళయిన ఒక జంట కూడా వచ్చారు. గులాబీమాలలు వాళ్ళ భుజాలనుండి సువాసనలు వెదజల్లుతున్నాయి. "మేమంతా ఫ్రాంటియర్ కాలేజీలో చదువుతున్నాము"అన్నాడు ఆ యువకుడు, అతని పేరు గంధ్. అతని ఫ్రెండ్సు ఇద్దరు, అప్పుడే లవ్ మారేజి చేసికొని, అందరితో పాటు వైజాగు వెళ్తున్నారట. వాళ్ళు సామాన్లు లగేజ్ లాకరులో పెట్టి, నానుచాకులు, స్టీల్ చైన్లు సీట్ల క్రింద పెట్టడం చూశాడు విర. అనుమానం వచ్చి అడిగాడు, "ఈ ఆయుధాలు ఎందుకు తెస్తున్నారు?", "మా ప్రొటెక్షనుకి సార్. ఈ ట్రయినులో మా ఎనిమీ గ్రూప్ కూడా వస్తున్నారు. వాళ్ళ లీడరు మాఫ్రెండును ముందు ప్రేమించాడు. ఇప్పుడు వీళ్ళు పెళ్ళి చేసుకున్నారని తెలిసి, ఆ గ్రూప్ వాళ్ళకు కోపం వచ్చింది. అయినా ఇది మాకు అలవాటే" గంధ్ అన్నాడు. విర అనుకున్నాడు - మనం ఎటు వెళుతున్నాము? ఈ టెక్నాలజి మనిషిని ముందుకు తీసుకెళ్తే, ఈ టెర్రరిజం మానవత్వాన్ని వెనక్కు తీసుకెళ్తోందేమిటి? నాణేనికి రెండు ప్రక్కలు ఉండాలికానీ, మానవత్వానికి రెండువైపులు ఎందుకు ఉండాలి? ఈ టెక్నాలజి ఇచ్చే కంఫర్టు ఉపయోగించుకొని మనమంతా ఐకమత్యంగా ఉంటూ, హాయిగా ఎందుకు బ్రతకలేము? ఎనౌన్స్ మెంట్ వచ్చింది, జలవేగం బయలుదేరుతున్నదని. వెంటనే డోర్లు అన్నీ మూసుకొన్నాయి. ఒక్క కుదుపులో బయలుదేరి, ఒక నిమిషంలో చాలా స్పీడ్ పుంజుకుంది. కిటికీలోంచి ఇళ్ళు, కార్లు, పొలాలు గిర్రున తిరిగి బైపాసు అయ్యాయి. పదిహేను నిమిషాలు కాగానే ఇంకో ఎనౌన్స్ మెంట్ వచ్చింది. బే-నీళ్ళలోకి ట్రైయిను ఎంటర్ అవుతోందని. అప్పుడు కిటికీలోంచి ఆఅద్భుతం చూశాడు, విర. నీళ్ళలెవెల్ పెరుగుతోంది. ఒక నిమిషంలోనే అంతా నీళ్ళు కనిపించాయి. ట్రైయిన్లో హేలోజను దీపాలన్నీ వెలిగాయి. అప్పుడప్పుడు దూరంగా చేపలు కనిపించాయి తళతళ మెరుస్తూ. అమ్మ, విమానంలో రమ్మన్నా, తను కావాలని జలవేగంలో రావాలన్నతన నిర్ణయం కరెక్టే అని అనుకున్నాడు. తను అమెరికా వెనక్కి వెళ్ళిన తర్వాత తనభార్యకు, కూతురుకు ఎంతోగర్వంగా చూపించుకోవచ్చని, తన డిజిటల్ కేమెరాలో వీడియోక్లిప్స్ తీశాడు.

అలా రెండు, మూడు గంటలు గడిచాయి. తను ప్రయాణం బడకలికతో చిన్నకునుకు తీసుకోవటం మొదలుపెట్టాడు. అంతలో ఎవరో ఆడవారు పెద్దగా అరిచారు. ఉలిక్కిపడి లేచాడు. చుట్టూ గందరగోళంగా ఉంది. గంధ్, అతని ఫ్రెండ్సు చాకులు, చైన్లు తిప్పుతూ వేరేవాళ్ళతో పోట్లాడుతున్నారు. వెంటనే అర్థం అయింది, విరకు. వేరే గ్రూప్ ఇక్కడికి వచ్చి పోట్లాట మొదలుపెట్టారు. విరకు వెంటనే గుండెలో రైళ్ళు పరిగెత్తడం మొదలు పెట్టాయి. జలవేగం ఇంకా నీళ్ళలో వెళ్తున్నట్లుంది. ఎవరో పెద్దగా అరిచారు, "బాబోయి, పిస్తోలు తీసాడు." వెంటనే పెద్దగా పేలింది ఆపిస్తోలు. దగ్గరలో ఉన్న ఒక కిటికీలోంచి దాని బుల్లెట్ వెళ్తూ, ప్రక్కనే ఉన్న ఇనుముకు తగిలి రికోషెట్ అయ్యి వేరో కిటికీలోనుంచి కూడ వెళ్ళింది. కిటికీగ్లాస్ పగిలి నీళ్ళు రావడం మొదలు పెట్టాయి. ఆడవాళ్ళు పెద్దగా ఏడుస్తున్నారు." నీళ్ళు వచ్చేస్తున్నాయి, మనమంతా చస్తాము." చుట్టుప్రక్కల అల్లకల్లోలంగా పరిగెట్టడం మొదలుపెట్టారు. విర వెంటనే చైనులాగండి అనబోయాడు కాని, ట్రైయిను ఇంకా నీళ్ళలోనే ప్రయాణిస్తోంది అనితెలిసి కిటికీలవేపు చూశాడు భయంభయంగా. ఆ కిటికీల గ్లాసు మొత్తం ఊడి వచ్చింది. నీళ్ళు బాగా ఉరవడిగా లోపలకి వస్తున్నాయి. జనంతొక్కుకొంటూ పరిగెడుతున్నారు. నీళ్ళు కాళ్ళదగ్గిరికి వచ్చాయి. చాలా చల్లగా తగులుతున్నాయి. తను కూడా నెట్టుకుని అక్కడి నుంచి పారిపోవాలని ప్రయత్నిస్తున్నాడు. కాని నీళ్ళు, వేరే కిటికీలోనుంచి కూడా వస్తున్నాయి. ఎక్కడ చూసినా వస్తువులు తేలుతున్నాయి. గొంతువరకు వచ్చేశాయి. చాలా ఉప్పగా ఉన్నాయి. క్యాబిన్లో పైన ఇక గాలి తగ్గిపోతోంది. పైకి తేలాలని బాగా ప్రయత్నిస్తున్నాడు. అప్పుడు అనుకొన్నాడు. తను విమానంలో వెళ్ళి ఉండాల్సింది అని. అమ్మచెప్పింది ఎప్పుడూ జవదాటకూడదని. బ్రతికించమని భగవంతుని ప్రార్థిస్తున్నాడు. పెద్దగా అరవాలని ప్రయత్నిస్తున్నాడు కాని, నోటి లోంచి అరుపు రావడంలేదు. చేతులు, కాళ్ళు కదలటంలేదు...

"లే, ఇంకా ఎంతసేపు పడుకొంటావు. ఏడున్నరయ్యింది" అంటూ అతని భార్య సహ, విరని గట్టిగా కుదిల్పింది. విర వెంటనే లేచి, గావుకేక వెట్టి, గాలిని పెద్దగా పీల్చాడు. అది చూసి అడిగింది సహ "ఏమన్నా పిచ్చికల వచ్చిందా?" అప్పుడు గ్రహించాడు, ఇదంతా ఒక పీడకల అని. అమ్మయ్య, నేను బ్రతికాను అనుకొన్నాడు. వెంటనే భార్యవేపు తిరిగి అన్నాడు, "ఈ వీకెండు గుడికి వెళ్దామా?" "భక్తి పెరిగితే, మంచిదేలే. త్వరగా రెడీ అవ్వు. అసలే లేఆఫ్సు చేస్తున్నారు మీ కంపెనీలో, ఇంతకీ ఏం కల వచ్చింది?" అప్పుడు అన్నాడు విర, "టైటానిక్ ఆన్ వీల్స్." "ఎక్కువ సార్లు చూస్తే అంతేమరి. హాయిగా మిస్సమ్మగాని, గుండమ్మకథ గాని చూసుకోండంటే వినరు." కరెక్ట్ అనుకొంటూ వర్కుకు రెడీ అవ్వడం మొదలుపెట్టాడు విర.

*(సలహాలు - సత్యం మందపాటి, రామ్ డొక్కా)*

# సజ్జనులు

**- శ్యామ్ సోమయాజుల**

ప్రొద్దుట పది కావస్తోంది. గుంపులు గుంపులుగా జనం నది ఒడ్డుకు చేరుకుంటున్నారు. అప్పటికే అక్కడ సుమారు వెయ్యి మంది దాక పోగయివుంటారు. గోదావరి పుష్కరాలు కావటం చేత చుట్టు ప్రక్కల గ్రామాలనుంచి నదీ స్నానాలకీ, పోయిన తరాలవాళ్ళకి తద్దినాలు పెట్టటానికీ, తరలి వస్తున్నారు. కడియం గ్రామంలో ఎప్పుడూలేని సందడి. ఊరంతా మామిడి తోరణాలతో, రంగు రంగుల కాగితాలతో, పూల దండలతో అలంకరించబడింది. లౌడు స్పీకర్లు భకిపాటలు పాడుతున్నాయి. నది మరీ లోతుగా లేని ప్రదేశాలకు ఇరువైపులా జనం వెళ్ళటానికి వీలుగా వెదురు బొంగులతో దడి కట్టారు నిర్వాహకులు. నది ఒడ్డున ఒక వైపు రాత్రికి రాత్రి జాతర ఒకటి వెలిసింది. రంగులరాట్నం, అద్దాల ఇల్లు, తోలు బొమ్మలాటలు, తుపాకీతో బెలూను పేల్చటం, ఇంకా ఎన్నో రకాల స్టాల్సు పెట్టారు. పీచుమిఠాయి అమ్మేవాళ్ళూ, బూరలమ్మేవాళ్ళూ... అక్కడంతా కోలాహలంగా, పండగ వాతావరణం ఏర్పడింది. ఏది ఆడాలన్నా, ఏది కొనాలన్నా రెండు రూపాయలు.. అవి లేకే నిరుత్సాహంగా, నది ఒడ్డున కట్టిన వెదురు కంచె మీద కూర్చుని కాళ్ళాడిస్తున్నారు పదకొండేళ్ళ మధుకర్, బాలస్వామి.

మీనాన్నని అడిగావా అసలు? అన్నాడు స్వామి. రాత్రే అడిగాను, సాయంత్రం ఆఫీసు నించి రాంగానే అందరం కలిసి వెళదామన్నారు- చెప్పాడు మధు. ఇవ్వాళా రేపే శలవులు, మళ్ళీ ఎల్లుండి నించీ స్కూలు. ఎదురుగా రంగులరాట్నం గిర్రున తిరుగుతోంది. అన్ని గుర్రాలమీదా కుర్రాళ్ళు కూర్చుని గాలిలో చేతులూపుతూ కేరింతలు పెడుతున్నారు. అదొక వింత అనుభూతి, ఎక్కినంతసేపూ గాలిలో తేలి పోతూ, ఎక్కడికో దూరంగా వెళ్ళిపోతున్న భావన, తీరా దిగేసరికి, అదే ఊరూ, అదే నేల, అదే వాతావరణం. ప్రపంచమంతా తిరిగేవి కళ్ళు మాత్రమే, ఖచ్చితంగా ఒక్కసారయినా ఎక్కితీరాలి. "మానాన్న మళ్ళీ తాగొచ్చాడు నిన్న. దగరికి పోవటానికే భయం వేసింది." తనెందుకు డబ్బులు తేలేదని మధు అడగలేదు. స్వామి వాళ్ళ నాన్న సంగతి క్లాసులో అందరికీ తెలుసు. అయినా చెప్పటం తనవంతనుకున్నాడో ఏమో స్వామి. "పోనీ మాయింటికి వెళ్ళి సాయంత్రం దాకా హోంవర్కు చేసుకుందాము. సాయంత్రం మాతో బాటు వద్దువు గాని." ఒక్కగానొక్క కొడుకు మధు. ఎంత గారాబంగా పెంచినా, చదువు విషయంలో మాత్రం ముద్దులన్నీ గట్టుమీద పెడతారు. మధు వాళ్ళిల్లు స్వామికి అలవాటే. కానీ తనకోసం మధు వాళ్ళ నాన్నడబ్బు ఖర్చు పెట్టటం ఎప్పుడూ ఇష్టం వుండదు స్వామికి. ఎన్ని సార్లు వుండమన్నా భోజనానికి కూడా వుండడు వాళ్ళింట్లో. ఓ.ఎన్.జీ.సీ లో ఇంజనీరు కాబట్టి మధు వాళ్ళకి పెద్ద బంగళా, ఒక జీపూ ఇచ్చారు. వాళ్ళ అమ్మా, నాన్నా ఎంత ఆదరించినా స్వామికి వాళ్ళతో బయటికి వెళ్ళడం అంటే ఇబ్బందిగానే వుంటుంది. ఏదో సాకు చెప్పాడు - సాయంత్రం మా నాన్నతో తోటకి పోవాలి. రంగులరాట్నం వైపే చూస్తూ చెప్పాడు స్వామి. నాలుగు రూపాయలుంటే ఎంత బాగుండును, అనుకొంటూ అలాగే కూర్చున్నాడు స్వామి, కాసేపు పీచు మిఠాయినీ, మరి కాసేపు, రంగులరాట్నాన్నీ మార్చి మార్చి చూస్తూ.. మధు నది వైపు కూర్చుని అక్కడ జరిగే తతంగాన్ని చూస్తున్నాడు. ఒరే, అక్కడ ఎవరిదో పర్సు పడిందిరా, చూద్దాంరా! ఒక్క ఉదుటున కంచె మీదనుంచి దుమికి మధు చెయ్యి పట్టుకుని జాతర వైపు లాక్కెళ్ళాడు స్వామి. అందరూ ఎవరి గొడవలో వాళ్ళున్నారు, ఎవ్వరూ దానిని గమనించలేదు. దగ్గరికి వెళ్ళి మెల్లగా దాన్ని చేతిలోకి తీసుకొన్నాడు స్వామి. మధు అటూ, ఇటూ చూశాడు, పర్సు పోగొట్టుకొన్న వాళ్ళు దానికోసం వెతుకుతూ ఎవరైనా కనిపిస్తారేమోనని. స్వామి దాన్ని జేబులో వేసుకుని, మధుతోబాటే అటూ ఇటూ వెతికాడు. ఎవ్వరూ, ఏదీ పోగొట్టు కున్నట్టు కనపడలేదు. అంత మందిలో ఆ పర్సు ఎవరిదో కనుక్కోవటం కష్టం. మరో అయిదు నిమిషాలు చూశాక, ఎంత సేపని వెతుకుతాము రా, ఎవడో దురదృష్టవంతుడు, పద. అని దూరంగా వున్న మామిడి చెట్టు క్రిందకి పరుగెత్తాడు స్వామి.

మధు అక్కడికి చేరేసరికి, పర్సులో ఏముందో చూస్తున్నాడు స్వామి. ఇందులో చాలా డబ్బులు వున్నాయి లాగుంది అన్నాడు స్వామి. ఎంతుంది? పదిహేడు వందలు, కానీ అన్నీ వందలే! చిల్లర లేదా? రూపాయుంది అంతే. ఏం చేద్దాం? పోగొట్టుకొన్న మనిషి కనిపించేదాకా జాతరలో ఖర్చు పెడదాం! ఇన్నేళ్ళకి రంగులరాట్నం ఎక్కే అవకాశం దొరికినందుకు సంతోషంగా వుంది స్వామికి. మధుకి ఆసలహా అంతగా నచ్చలేదు. ఏదో తప్పు చేస్తున్నామన్న భావన మనసులో మెదులుతోంది. తాము దొంగిలించలేదు. పోగొట్టుకున్న వాడికోసం వెతికారు కూడా, పోనీ పోలీసులకి అప్పజెప్పొచ్చు కదా? అదే మాట స్వామితో అన్నాడు. వాళ్ళు మాత్రం దీన్ని ఏం చేస్తారనుకుంటున్నావు? శుభ్రంగా తినేస్తారు, ఆ పనేదో మనమే చేసేద్దాం. అయినా మనం ఎంత ఖర్చు పెడతాం ? ఇంకా మధు మొఖం అదోలా వుండేసరికి అన్నాడు స్వామి, మనం ఇక్కడే తిరుగుతాము కాబట్టి ఆ పోగొట్టుకున్న మనిషి తప్పక దొరుకుతాడు. మిగిలిన డబ్బులు ఇచ్చేద్దాం. మధు ఏమీ అనలేదు. పద వెళ్ళి అది ఎక్కుదాం అన్నాడు స్వామి, మధుని అటువైపు లాగుతూ. ఒక వంద నోటు బయటకి తీసి, పర్సు జేబులో పెట్టుకున్నాడు స్వామి. టిక్కెట్టు ఇచ్చేదగ్గర బాగా రద్దీగావుంది. ఆ గుంపు మధ్యలో చెయ్యి దూర్చి రెండూ అన్నాడు స్వామి. చెయ్యి వెనక్కి తోసేసినట్టనిపించింది చిల్లర పట్రా! గొణిగాడు కౌంటరులో అబ్బాయి. కాళ్ళీడ్చుకొంటూ వెనక్కి వెళ్ళాడు. డబ్బులు లేవు అనుకుంటే, ఒక్క సారిగా ఇప్పుడు ఇన్ని దొరికాయి. ఇప్పుడు చిల్లర ఎలాతెచ్చేది? ఆ కిరాణా కొట్టులో అడుగుదాం పదా! అన్నాడు మధు. నేనీ గోడ ప్రక్కన వుంటాను, నువ్వెళ్ళి అడుగూ అన్నాడు మధు మళ్ళీ. స్వామి లోపలికి వెళ్ళాడు. సేటు ఏమన్నాడో వినబడలేదు కొద్ది సేపు మధుకి. మరో రెండు నిమిషాలలో స్వామి పరుగెత్తుతూ బయటికి వచ్చాడు, వెనకే సేటు..

ఇంత లేడు అప్పుడే దొంగతనం. ఎక్కడ కొట్టేశావురా ఇదీ..అరుస్తున్నాడు. గోడ ప్రక్కనే వున్న మధుకి విషయం అర్థం అయ్యింది. పదకొండేళ్ళ వాడి దగర ఈ పల్లెటూరులో వంద రూపయల నోటు! సేటు ఆ నోటుని మెల్లిగా జేబులో వేసుకోబోతుంటే చటుక్కున గోడ చాటునించి వచ్చి, దాన్ని లాగేసుకుని, స్వామి వెళ్ళిన వైపే పరుగెత్తాడు మధు. సందు తిరిగేదాకా పరుగెత్తి ఆగిపోయారిద్దరూ. ఇది కొట్టేద్దామనుకున్నాడు, వాడు అసలు దొంగ! వందనోటు చూపిస్తూ అన్నాడు మధు. మధుకి ఏది కావాలంటే అది కొనిస్తారు వాళ్ళ అమ్మా, నాన్నా. కానీ ఎప్పుడూ మధుకి డబ్బులు ఇవ్వరు, ఎందుకని అడిగితే నీ మీద నమ్మకం లేక కాదు నాన్నా, నీకు అవసరం ఏముంది చెప్పు? ఈవయసులో, జేబులో డబ్బులుంటే చెడు అలవాట్లు అయ్యే అవకాశం ఎక్కువ. నీకు ఏం కావాలన్నా చెప్పు, నాన్నా, నేనూ కొనిస్తాము, అన్నిటికీ సూటిగా సమాధానం చెపుతుంది మధు అమ్మ.

## ☺మోర్ ఈక్వల్స్☺ – శ్రీనివాస ఫణికుమార్

మనమంతా సమానమే, కాకపోతే మేం కొంచెం ఎక్కువ సమానం, అంతే..
అందరమూ మనుష్యులమే, కాకపోతే మేం దేవతలకు కొంచెం దగ్గర చుట్టాలం, అంతే..

దేవుడికైనా సరే, మేమే పడేస్తాం, అడపా దడపా ఓ యోగ్యతా పత్రం..
కనకపు సింహాసనాన మా వాళ్ళనే కూర్చోబెడతాం,
వెనకనుండి కథలన్నీ మేమే నడిపిస్తూంటాం..

ఈసారి వసంతం తీరే మార్చేస్తున్నాం,
మన కాకి బావ కచేరీ కోసం, కోకిలమ్మ కొమ్మ ఖాళీ చెయించేశాం,
నాట్యమయూరికి పోటీగా, మా నత్తగుల్లకి ట్రెనింగ్ ఇప్పిస్తున్నాం,
క్వాలిటీ విషయంలో బెంగెట్టుకోకండే, కాంప్రమైస్ అయ్యే ప్రశ్నే లేదు..

కాళిదాసు కావ్యాల్లో "కాన్నొటేషన్లు" బాగోలేవు,
ఖాళీ టైము దొరక్క గాని, "శకుంతలాన్ని" సరి దిద్దేదుం,
మేం రాసిన "రామాయణం" ఇంకా చదవనేలేదా మీరు?
అయ్యో! త్వరగా కొనుక్కోండి, దానికి మంచిరెవ్యూలొచ్చాయి..
భీష్మ, ద్రోణ, కృపాదులూ, వృద్ధులూ, పెద్దలూ ఈ పక్షాన ఉండగా,
డామిట్! వాళ్ళు గెలవడమేమిటి, వ్యాసుడి వెర్రితనం కాకపోతే..

అక్రూర వరదులం కాకపోయినా, అష్టమ గర్భాన పుట్టక పోయినా,
అరతలమాటెల్లా ఉన్నా, అగ్ర పూజలన్నీ మాకే – ఆమాట కొస్తే, అన్ని పూజలూ మాకే..
ఎందుకని అడక్కండి, చెప్పలేక చస్తున్నాం !
ఓసారి చెబితే వినండి, మేం కొంచెం ఎక్కువ సమానం !!

## No Applicants for learning Telugu from a reputed University?

The South Asian Summer Language Institute *(SASLI - http://www.wisc.edu/southasia/sasli)* at the University of Wisconsin has been offering an 8 week long Telugu learning course in summer for graduate and under graduate students, for many years now under the guidance of Prof. Velcheru Narayana Rao. This year's schedule is from **June 16 to August 8, 2003** which offers the equivalent of ***two full semesters of academic year study***. ***The instructional fee is $2,400*** and upon completion of the program, the students will receive a University of Wisconsin-Madison transcript reflecting ***8 credits of language study and a letter grade (A-F based on the student's performance).*** Unfortunately, they have ***not*** received ***even one application*** for learning Telugu this year so far and there is a possibility that the summer course ***will be cancelled one more year*** for lack of enrollments. Isn't it time for all committed ***Pravasandhrulu*** living in the USA and elsewhere to encourage and send their offspring for a summer school from a very reputed University? We talk of doing so much for preserving and propagating our mother tongue and cultural heritage. Shouldn't our commitment be reflected in our actions? Soccer-Foot Ball-Soft Ball, Gymnastics-Skating-Swimming and Music-Dance-Kumon, ***Why should learning our beloved language and culture take a back seat?***

Support ***Telugu Badi*** being conducted ***in Austin*** and elsewhere by a few committed & talented individuals.
***Please Read Telugu, Write in Telugu & Respect Telugu! When you do, your children will follow!!***

### మీ మాట

మన "తెలుగు వాణి"లో ప్రచురణార్థం మీ రచనలకు యిదే మా ఆహ్వానం. తెలుగు భాష, సంస్కృతి, తెలుగు వారి జీవన విధానం ప్రధాన యితివృత్తాలుగా మీరు వ్రాసిన కథలూ, కవితలూ మరియు గీతాలను నలుగురితో పంచుకోవటానికి, మీ అభిప్రాయాలను అందరికీ తెలియజేయటానికీ, పదిమందికీ ఉపయోగపడే వార్తలూ, విశేషాలూ, ఆర్టికల్సు సేకరించటానికీ తెలుగు వాణి సదా ప్రయత్నిస్తూ వుంటుంది. దానికి మీ సహాయ సహకారాలు, ప్రోత్సాహమూ చాలా అవసరం. అందుకే కలమూ, కీ-బోర్డూ విదిలించి, కాగితం మీదో, కంప్యూటర్‌లోనో యెక్కించిన మీ రచనలను, ఇ-మెయిల్‌ద్వారా **austinteluguvani@yahoogroups.com** వద్దకు పంపించండి. "తెలుగు వాణి" పాత సంచికలు కావాలంటే **http://www.austintelugu.org/teluguvani.html** క్లిక్ చేయండి.

**సజ్జనులు→** ఒక్కసారిగా ఇంత డబ్బు చూసేసరికి మధుకి ఒక ప్రక్క భయం వేసినా, స్వామితో జాతరలో మజా చెయ్యొచ్చని ఉత్సాహంగావుంది. వచ్చిన దారినే జాతర వైపు వెళితే, సేటు ఎక్కడ పట్టుకుంటాడో అని చుట్టూ తిరిగి వెళ్ళసాగారు.

ఇదే సందులో సారా కొట్టు వుంది తెలుసా? అన్నాడు వున్నట్టుండి స్వామి కొద్ది దూరం పోయాక. నివ్వెర పోయాడు మధు. నీకెలా తెలుసు? తన మిత్రుడు తాగుడు మొదలెట్టాడేమో అన్న భయంతో అడిగాడు. తాగి పడిపోతే, అప్పుడప్పుడు మానాన్నని ఇంటికి తీసుకుపోతాను ఇక్కణ్ణించీ, స్వామి వైపు చూశాడు మధు. ఏదో అలోచిస్తూ నడుస్తున్నాడు స్వామి. "నాకెప్పుడూ అనిపిస్తుంది, ఆ సీసాలో ఏముందీ అని. ఎలా వుంటుంది అది? దాని కోసం మా నాన్న ఇలా తయారయ్యాడు. నాకు ఒక సారి అదెలా వుంటుందో చూడాలనిపిస్తోంది" మధు దగ్గర వంద నోటు తీసుకుంటూ అన్నాడు స్వామి. ముందు కోరిక పుట్టి తరువాత డబ్బు పుట్టిందో, లేక డబ్బు వుంది కాబట్టి కోరిక పుట్టిందో చెప్పటం ఆ క్షణంలో కష్టం. విస్తు బోయాడు మధు. నీకేమైనా పిచ్చి పట్టిందా. ఒక్క సారి తాగితే అంతే ఇంక మానలేవు. నువ్వూ, మీ నాన్న లాగా అయిపోతావు.గిర్రున వెనక్కి తిరిగాడు స్వామి, ఎంత తాగినా వాళ్ళ నాన్నంటే స్వామికి ఇష్టమే. మత్తులో వున్నప్పుడు ఎంత దుర్మార్గుడిలా ప్రవర్తిస్తాడో అది తేలిపోయాక కొడుకంటే అంత ప్రేమ చూపిస్తాడు. అన్నీ నీకే తెలుసురా! కోపంగా, ఎగతాళిగా అన్నాడు. అవును, మా అమ్మ చెప్పింది. మా అమ్మ నాకు అన్నీ చెప్తుంది. ఏది చెయ్యొచ్చో, ఏది చెయ్యకూడదో. మధు వాళ్ళమ్మంటే స్వామికి చాలా గౌరవం. అందరికీ అలాంటి అమ్ముంటే...

కొంచం శాతించాడు స్వామి. సారా కొట్టు దగ్గర బడుతోంది. ఇంకా తలవంచుకుని ఆలోచిస్తున్నాడు స్వామి. అది చూసి అన్నాడు మధు. నువ్వు అందులోకి వెళితే, ఇంక మన దోస్తీ కట్టు. మా ఇంటికి కూడా రానివ్వదు నిన్ను మా అమ్మ. ఏడాది క్రిందట హదరాబాదు నించీ ట్రాన్స్ఫరు మీద ఇక్కడికి వచ్చారు. మధు తెలుగులో హిందీ అప్పుడప్పుడూ కలుస్తూండటం స్వామికి కొత్త కాదు. కొట్టు వచ్చేసింది. స్వామినే చూస్తున్నాడు మధు. ఏమీ మాట్లాడ కుండా దాన్ని దాటేశారిదరూ. పోలీస్స్టేశనులో ఇచ్చేద్దాం పదా అన్నాడు స్వామి తలెత్తి. ఒక్కటే గదీ, అది కూడా చిన్నది. తలుపుకు ఎదురుగా బల్లకి అవతల కూర్చున్నాడు యూనీఫాంలో పోలీసు. ఏం కావాలి? అడిగాడు వీళ్ళిద్దరినీ చూసి. మాకు ఈ పర్సు జాతరలో దొరికింది. ఇచ్చేద్దామని వచ్చాము దానికోసమే చూస్తున్నట్టు కుర్చీ నించీ లేచి దాన్ని అందుకున్నాడాయన. కానిస్టేబుల్ ఇందాక పర్సు పోయిందని వచ్చాడే వీళ్ళ నాన్న, ఆయన్ని వెతికి పట్రా. పర్సు దొరికిందని చెప్పూ అన్నాడు, మూల బల్ల మీద కూర్చున్న చిన్నపిల్లని చూపిస్తూ. గంట క్రితం ఒకాయన వచ్చాడు పర్సు పోయిందంటూ. పిల్లనిక్కడ వుంచి వెతకటానికి వెళ్ళాడు. పక్యూరులో పెద్ద ఆసామీ ఆయన. మన వూరిలో జేబు దొంగలున్నారని కూడా అన్నాడాయన. రానీ చెప్తానూ మరో పదిహేను నిమిషాలలో ఆయన్ని వెంట బెట్టుకుని వచ్చాడు కానిస్టేబుల్.

ఇదిగోండి సార్ మీ పర్సు దొరికింది. జాతరలో వీళ్ళకి దొరికితే, మంచి కుర్రాళ్ళలా తెచ్చిచ్చారు. మీ అదృష్టం బాబూ చాలా థ్యాంక్స్ పుష్కరాలకోసం వస్తే, పీచుమిఠాయి చూసి బేబీ ఏడిస్తేను, కొందామని వెళ్ళాను. ఎక్కడ పడిపోయిందో ఏమో. మీలాంటి వాళ్ళు ఈ వూళ్ళో వుండడం, ఈ వూరికే అదృష్టం ఏమేమో అంటున్నాడాయన, పర్సు దొరికిన ఆనందంలో.

ఇవేమీ వినబడటేదు స్వామికీ, మధుకీ, ఎదురుగా కిటికీలోంచి రంగులరాట్నమే కనిపిస్తోంది. "చిన్న పిల్లలకి డబ్బులు అలవాటు చెయ్యటం నాకు ఇష్టముండదు." పర్సు వెనక్కిచ్చినందుకుగాను ఏమైనా ఇస్తాడేమో? అనుకున్నాడు స్వామి, కానీ ఈ మాట వినేసరికి నిరుత్సాహబడ్డాడు. "మీరెప్పుడయినా రంగులరాట్నం ఎక్కారా?" అడిగాడాయన. ఇద్దరి మొఖాలూ ఒక్కసారి వెలిగి పోయాయి. *****

## ''మమ''

*- సత్యం మందపాటి*

ఈ జీవన పోరాటాన్ని చూసి
నాలో యువక రక్తం ఉడుకుతున్నప్పుడు
ఈ దరిద్రపుగొట్టు ప్రపంచాన్ని
పూర్తిగా మార్చేయాలనుకొన్నాను,
తరువాత పదేళ్ళకి తెలిసింది,
ఈ ప్రపంచాన్ని మార్చటం నా తరం కాదని.
అందుకనే కనీసం నా దేశాన్నయినా
మార్చాలనుకొన్నాను,
మరో పదేళ్ళకి కానీ అర్థమవలేదు,
నాదేశాన్ని మార్చటం అంత సులభం కాదని.
అప్పుడే అనుకొన్నాను,
అస్తవ్యస్తంగా నా చుట్టూ వున్న
సమాజాన్నయినా మార్చాలని,
అదీ సాధ్యం కాదని తెలుసుకొనేటప్పటికి,
అంపశయ్య మీద పవళించాల్సి వచ్చింది.

అప్పుడు అనిపించింది,
మార్చవలసింది ఈ ప్రపంచాన్నీ, నా దేశాన్నీ,
నా చుట్టూ వున్న సమాజాన్నీ కాదు-
నన్నూ, నా ఆలోచనలనీ, అని.
అలా, ఏనాడో నేను మారి వుంటే,
నన్ను చూసి,
నా చుట్టూ వున్నసమాజం మారి వుండేది.
ఆ మారిన సమాజాన్ని చూసి,
నా దేశం మారి వుండేది.
ఇలా దేశాలన్నీ మారితే,
ప్రపంచమే మారిపోతుంది కదా మరి!

*(We MUST be the change we wish to see అన్న మహాత్మా గాంధీ గారి సూక్తి ఆధారంగా - రచయిత)*

# తరం-తరం

**- *గిరిజాశంకర్ చింతపల్లి***

సోమవారం ప్రొద్దున్న అయిదు గంటలు. ఠంగ్ మని శబ్దం. పంచపాత్ర, వుద్ధరిణె క్రింద పడి. సుబ్బారావు దేవతార్చన చేసుకొంటుంటే చేయిజారి ఈ ఉపద్రవం జరిగింది. ''అప్పుడే మొదలయ్యిందీ గోల, అవతలి వాళ్ళు నిద్రపోయారని ఇంగితం గూడా లేదు. కోడి కూయక ముందే చప్పుళ్ళూ, తాటాకులూ'' లోపలి నుండి సుబ్బారావు పెద్దకోడలు శాంత విమర్శ వినబడింది. సుబ్బారావుకీమాటలు కొత్తేం కాదు. ఆచమనం తోటే అవమానాన్ని కూడా దిగమ్రింగడం అలవాటు చేసుకొన్నాడు. రిటైరై పది సంవత్సరాలయింది, భార్య చనిపోయి పది నెలలయ్యింది. ''ఒక్కడివీ, ఏం ఉంటావులే నాన్నా'' అని కృష్ణుడు ప్రాధేయపడితే, ఊళ్ళోనే ఉద్యోగం, వేరే అద్దె ఇల్లు ఎందుకని, తన ఇల్లు వాళ్ళకి ఇచ్చి, తనే ఒక గదిలో ఉంటున్నాడు సుబ్బారావు. మిగతా ఇద్దరు కొడుకులూ, కూతురూ, ఆంధ్రదేశంలో తలో మూలా ఉన్నారు. - ఇదిగో కాఫీ- అన్న శాంత గొంతుతో, మళ్ళీ ఈ లోకంలో పడ్డాడు. తన భార్య వున్నన్నాళ్ళూ, తన కన్నా ముందుగా లేచి, పూజసామగ్రి అంతా అమర్చి, దీపారాధన చేసి, ప్రక్కనే వుండి అన్నీ అందించేది, ఇప్పటి సంగతి -ఇదీ- మరి.

"తాతయ్యా, ఏం చేస్తున్నావు?" అంటూ దగరకు వచ్చాడు ఆరేళ్ళ మనవడు. ''ఆ ముసలాయనతో ఏమిట్రా, త్వరగా తెములు. బడికి వెళ్ళాలి, తెలీదా?" అని శాంత అరచింది. "నేను ఈ రోజు బడికి వెళ్ళను, తాతయ్య దగ్గర భాగవతం వింటాను" అన్నాడు మనవడు. "భాగవతం లేదు, రామాయణం లేదు, అవేమన్నా అన్నం పెడతాయా? బడికి వెళ్ళు భడవా" అని కోప్పడింది శాంత. సుబ్బారావు భాగవతం తీసి ఇంకొకసారి కళ్ళకద్దుకొన్నాడు.

పెదకొడుకు కృష్ణుడు తన ముందు భార్యనేమీ అనడు. అసలు తనితోగూడా ఎక్కువ మాట్లాడడు. వాడి అభిప్రాయమేమిటో, అభిరుచులేమిటో తనకు అంతు పట్టకుండా వుంది. అయినా వాడు భార్యకు ఎదురు చెప్పగా తను వినలేదు. కొడుకు ఆఫీసుకు వెళ్ళాక, న్యూస్ పేపరు చదవడం, భాగవత పారాయణం చెయ్యడం, భోజనం చేసి కాసేపు నడుం వాల్చడం, సాయంత్రం అలా బయటికి వాక్ కి వెళ్ళడం - ఇదీ సుబ్బారావు దిన చర్య. రోజంతా శాంత ఆ మాటా, ఈ మాటా అంటూనే వుంటుంది. తను పడుకొంటే తప్పు, భాగవతం గట్టిగా చదువుకొంటే తప్పు, ఎవరైనా అతిథులు వచ్చినప్పుడు తను వారి కంటపడితే తప్పు. ఇక, టీవీ, రేడియోలలో తన స్వతంత్రమేమీ లేదు. వాళ్ళు పెటిన స్టేషను వింటే వినడం, చూస్తే చూడడం, లేకపోతే లేదు. "భగవంతుని దయ వలన, తన కాలూ, చెయ్యీ ఇంకా స్వతంత్రంగానే ఉన్నాయి" అనుకొని ఆ నారాయణుడికి మనసారా నమస్కరించుకొన్నాడు, మనసులోనే.

సాయంత్రం మనవడు స్కూలు నుండి వస్తూనే, తాతయ్య దగ్గరికి పరుగెత్తి వచ్చి, "తాతయ్యా, ఇవ్వాళ స్కూల్లో ఒక తమాషా జరిగింది" అని ఆదుర్దాగా ఏదో చెప్పబోయాడు. "తాతయ్యతో ఏమిట్రా టైంవేస్ట్. హోం వర్క్ చేసుకో, ఫో. " శాంత శాసనం వేసింది. ఇంతలో కొడుకు వచ్చాడు. "ఏం నాన్నా, ఎలా వుంది కాలు నొప్పి?" అడిగాడు కానీ, సమాధానం వినకుండానే లోపలికి వెళ్ళిపోయాడు. రాత్రి తొమ్మిది గంటలకి భోజనాలు చేసి కూర్చున్నారందరూ. మనవడు పడుకొన్నాడు. ఈరోజు రాత్రి టీవీలో మహాభారతం-విరాటపర్వం చూపిస్తారు, చూద్దామని ఉబలాటంగా కూర్చొన్నాడు సుబ్బారావు. "ఒరేయ్, కృష్ణా, ఆ ఛానెల్ పెట్టరా నాయనా, భారతం వస్తుంది" అనగానే, "భారతం లేదు, గీరతం లేదు, ఈ-టీవీ లో, ఆ ఒక్కటీ అడక్కు తెలుగు సినిమా వస్తోంది, చూడాలి" అని శాంత ఉత్తరువు వేసింది. దాంతో తన భాగవతం పుస్తకం తీసుకొని తన గదిలోకి చేరాడు సుబ్బారావు. ఇది ప్రతి సోమవారం జరిగే కథ. ఇదే కథ, దాదాపు ఇదే శృతిలయలతో మంగళ, బుధ, గురు, శుక్ర వారాల్లో కూడా ఇలాగే జరుగుతుంది. ఆంధ్ర దేశ వాతావరణం లాగే దీనిలోనూ పెద్ద మార్పేమీ ఉండదు.

శనివారం తెల్లవారింది. ప్రక్కింటి రేడియోలో శ్రీవేంకటేశ్వర సుప్రభాతం వినిపిస్తోంది. సుప్రభాతం అయిపోయాక అందరూ నిద్ర లేచారు. మనవడు వచ్చి "తాతయ్యా, నన్ను పార్కుకితీసుకెళ్ళు" అన్నాడు. "సరే పోదాం పద" అంటూ చెప్పుళ్ళో కాళ్ళు పెట్టబోతూంటే, "వాడికవీ ఇవీ కొనిపెట్టి పాడు చేయకండి" అంటూ శాంత మరో శాసనం వేసింది. అయినా వస్తూ వస్తూ మనవడు మరీ మారాం చేస్తుంటే, ఉండబట్టలేక చిన్న ఐస్ క్రీం కొని పెట్టాడు సుబ్బారావు. ఇంటికొచ్చాక అదొక పెద్ద రాద్ధాంతమయ్యింది.

"శాంతా, ఇలారా" అని కొడొకు పిలిచాడు. వంటింట్లోకి వెళ్ళారు. "ఎందుకు? పెదవాడు, మా నాన్నని అన్ని మాటలంటావు? ఈ ఇల్లు ఆయనదీ, ఆయన మెహర్బానీ వల్లనే మనం అద్దె, గిద్దె లేకుండా వూరికే వుంటున్నాము." ఈ పదీ నెలల్లో మొట్టమొదటి సారి, తన కొడుకు తనకు సపోర్టు ఇవ్వడం. "అద్దె లేకపోతే మాత్రం, మూడు పూటలా మేపడం లేదూ? అయినా, ఇంకా కొడుకులూ, కూతుళ్ళూ ఉన్నారు గదా, ఎప్పుడూ మనింట్లోనే అఘోరిస్తాడేం? శనిగ్రహం లాగా" శాంత జవాబు. తను ఎంత వినవద్దనుకొన్నా, వాళ్ళు తను వినాలని మరీ గట్టిగా మాట్లాడారేమో, సుబ్బారావుకి ఈ మాటలు వినబడ్డాయి. సుబ్బారావు ఒక గ్లాసు మంచి నీళ్ళతో బాటు ఈ శాపనార్థాలు గూడా దిగమింగాడు. "ఎప్పుడు తప్పులు వెదకెడు, నప్పురుషుని గొల్వగూడదది యెట్లన్నన్, సప్పంబు పడగ నీడను, కప్పవసించు విధము గదరా సుమతీ.." అన్న పద్యం గుర్తు వచ్చింది.

ఆదివారం ప్రొద్దున్న నిద్ర లేచినప్పటి నుండీ, తన మనవడికీ, వాళ్ళమ్మ శాంతకీ, హోరాహోరీ యుద్ధం జరుగుతోంది. వాడు బయటికి వెళ్ళి ఆడుకొంటానంటే, ఈవిడ ససేమిరా వల్లకాదంది. చివరికి వాడు, కోపం వచ్చి "నువ్వసలు మంచి దానివి కాదు, తాతయ్యని గూడా ఎప్పుడూ తిడుతూనే వుంటావు"అన్నాడు. శాంతకి కోపం వచ్చి రెండు తగిలించింది. వాడు ఏడ్చుకొంటూ - నాకేం అక్కర్లేదు ఫో- అంటూ అలిగి మూల కూర్చున్నాడు. ఇదంతా చూస్తూ ఏం చేయాలో తెలియక, ఆలోచిస్తున్నాడు సుబ్బారావు. తరతరాలుగా జరుగుతున్నది ఈ తరం-తరం లేదా జెనరేషన్ గ్యాప్. తను ఏమైనా సలహా ఇద్దామన్నా, తన మాటకి విలువ లేదు. ఈ మోడరన్ సమాజంలో, ఇంట్లో పెద్ద వాళ్ళు, తప్పనిసరిగా భరించాల్సిన బంధువులయిపోయారు. వర్ణాశ్రమ ధర్మాలంటే "బ్రహ్మ చారి, భ్రమచారి, సంసారి, బికారి" అని చెప్పుకోవాల్సి వస్తోంది అనుకొంటూ మనవడివైపు చూస్తే జాలి వేసింది. వాడూ తనలాగే బాధ పడుతున్నాడు. కాసేపు అలా బయటకు వెడదామని వాడి దగ్గరకు చేరాడు. వాడు నిద్రపోయి మూలుగుతోంటే, ఎత్తి పక్కమీద పడుకోబెట్టాడు. అప్పుడు వాడు, "ఈ పెద్ద వాళ్ళెప్పుడూ ఇంతే, పిల్లలబాధలు తెలుసుకోరు, మమ్మల్ని అసలర్థం చేసుకోరు" అన్నాడు. సుబ్బారావుకి, వాడి పరిస్థితికీ, తన పరిస్థితికీ ఉన్న పోలిక కనిపించింది. ప్రేమతో మనవడి తల నిమిరాడు. "నాకు తెలుసురా నీ బాధ. నీదీ, నాదీ ఒక్కటే. మన బాధ ఈ పెద్ద-వాళ్ళు ఎవ్వరూ అర్థం చేసుకోరు" అని గట్టిగా నిట్టూర్చాడు. *****

## నాకు నచ్చిన పాట

\- *లత గొబ్బూరు*

"ఎవరు రాయ గలరు అమ్మ అనే మాట కన్న కమ్మని కావ్యం,
ఎవరు పాడగలరు అమ్మ అన్న పాట కన్న తీయని రాగం,
అమ్మేగా తొలిపలుకు నేర్చుకొన్న భాషకి,
అమ్మేగా ఆది స్వరం ప్రాణమనే పాటకి..
అవతారమూర్తి అయినా అణువంతే పుడతాడు,
అమ్మ పేగు పంచుకొనే అంత వాడు అవుతాడు,
అమ్మేగా చిరునామా ఇంతటి ఘనచరితకి,
అమ్మేగా కనగలదు ఇంత గొప్ప అమ్మని.. "

దర్శకరత్న దాసరి నారాయణరావు గారి దర్శకత్వంలో వచ్చిన "అమ్మ రాజీనామా" అన్న చిత్రం లోని ఈ పాటని మధురగాయని చిత్ర ఆలపించారు. ఊహ తెలిసిన నాటి నుండి, ఊపిరిపోయేనాటి వరకూ, మనం నిత్యం పిలుచుకొనే -అమ్మ- అన్న పదానికి ఎంత అందమైన భాష్యం చెప్పారో కదా. అందుకే కాబోలు మానవ చరిత్రలో, జీవనంలో అమ్మ చిరస్థాయిగా నిలిచిపోయింది. సినీ సాహిత్యంలో అమ్మకు ప్రాధాన్యమిచ్చిన గీతాలలో -అమ్మ అన్నది ఓ కమ్మని మాట, అది ఎన్నెన్నో మమ మూట-, -అమ్మ ప్రేమకు మారుపేరు, అమ్మ మనసు పూలతేరు-, -అమ్మా అని పిలిచినా ఆలకించవేమమ్మా-, రేపల్లె ఈపల్లె, ఈ ఇల్లు నీ ఇల్లు, ఇదిగో నీ తల్లి, అమ్మా అమ్మా అను మళ్ళీ మళ్ళీ- వంటి అనురాగభరిత, ఆత్మీయత నిండిన గీతాలెన్నో.

మన పురాణపురుషులు, అవతారమూర్తులు అయిన రాముడు, కృష్ణుడు వంటి వారు కూడా తమ తల్లులను -మాతృ దేవో భవ- అని పూజించి, దేశానికి రాజైనా తల్లికి తనయుడే అని, అంతటి తమ ఘనచరితలకీ వారివారి తల్లులే కారణమని చాటి, మనందరికీ ఆదర్శప్రాయులైనారు. అమిత ఆనందం కలిగినా, అపరిమిత దుఃఖం కలిగినా మననోటి వెంట వచ్చే మొదటి పదం అమ్మ. చిన్ననాటి నుండి "శ్రీరామరక్ష" అనీ, "దీర్ఘాయురస్తు" అనీ దీవించి, మనం తప్పటడుగులు వేస్తే ఆనందించి, ఎక్కడ తప్పటడుగులు వేస్తామోనని కలవరపడి, మనలను కంటిపాపలా కాపాడి, పెంచి పెద్ద చేసిన అమ్మ ఋణం ఎంత చేసినా తీరదనిపిస్తుంది.

మనిషి మనుగడకి తల్లిదండ్రుల అవసరం సరి సమానమైనా, తల్లిదే మొదటిస్థానం. స్థానం ఉన్నతమైనా, మనం మన కన్న తల్లిని నిజంగా, అంతగొప్పగా చూస్తున్నామా? అని ఆలోచించాల్సి వస్తోంది. గాంధీగారు చెప్పినట్లు ఒక వ్యక్తి విజ్ఞానవంతుడైతే అది అతని వరకే పరిమితం, కానీ ఒక తల్లి విజ్ఞానవంతురాలైతే, మొత్తం కుటుంబానికే ఉపయోగం. ఆ రోజుల్లో తల్లిపట్ల అంతటి గౌరవాన్నిచూపారుకాబట్టే, మన అమ్మమ్మలు, నాయనమ్మలు, అంతగా చదువుసంధ్యలు లేకపోయినా సమిష్టికుటంబాలుగా ఉంటూ, వినయ విధేయతలు, ప్రేమాదరణాసహనాల పట్టాలు పుచ్చుకొని, ఇల్లనే సామ్రాజ్యాన్ని ఏకఛత్రాధిపత్యంగా ఏలేసేవారు.

ఈనాడు ఎవరి అదుపాజ్ఞలు లేని చిన్న కుటుంబాలోకూడా అమ్మలకి ఎన్నో సమస్యలు, చీకాకులు, చింతలు ఎదురవుతున్నాయి. మా తాతగారు అన్నట్లు, బి.ఏ.లు చదివినా బియ్యాలు చెరగాల్సిందేనని, ఇంటా, బయటా అనునిత్యం అష్టావధానాలు, శతకోటి శతావధానాలు చేయవలసి వస్తోంది. అమ్మంటే వట్టి వెట్టి చాకిరిగా మిగిలిపోతోంది కొందరికి. ఆలోచిస్తే, మన పిల్లలకి కనీసం "మాతృదేవోభవ" అన్నదానికి అర్థం కూడా తెలియకుండా పోతుందేమోనని భయంవేస్తుంది.

తల్లిని ప్రేమించలేనివారు ప్రపంచంలో మరెవ్వరినీ ప్రేమించి, గౌరవించలేరని నానుడి. అడ్డాలలో బిడ్డలుగాని, గెడ్డాలనాడు కాదని, ఏతల్లీ బాధపడకుండా చూసుకొంటేనే, మనం మన పిల్లలకు ఆదర్శవంతులమవుతాము. అసలు, ఆ భగవంతుడు కూడా, పిలిచిన పలికే "దైవం"గా, అన్ని సమయాలలో, అన్నిప్రదేశాలలో, అందరితో ఉండలేకనే, తనకు ప్రతిరూపంగా, "అమ్మ"ను సృష్టించాడట. ఎందరో అమ్మలు, అందరికీ వందనాలు!!

## బెల్లం కొట్టిన రాయి

\- *హరి మద్దూరి*

చిన్న చిన్న చీమలు ఒక బెల్లం ముక్క వెంట బందర్లో బస్సు ఎక్కాయి. కుటుంబరావింటికివెళ్ళి, కొడుకు ఆనందరావు పెట్టెలో చేరి, అమెరికా వచ్చాయి. భారతంలో వదిలేసిన "బెల్లం" గురించి బాధపడుతున్నా, రోజులు బాగానేఉన్నాయి. కష్టించి పనిజేస్తూ, సమిష్టిగా కూడపెడుతూ, అమెరికా అంతా వ్యాపించాయి.

కాలం కొన్ని తరాల చీమల్ని దొర్లించింది. అయినా పోలేదు బెల్లం గురించి బాధ. సభలు, సమావేశాలు పెట్టుకొన్నాయి. భావితరాలకు తెలియాలని "బెల్లమునేకదంతమును.." అన్న పద్యాలు రాసుకొన్నాయి. మరికొన్ని తరాలు దొర్లాయి. బుజ్జి బుజ్జి చీమలు "బెల్లం అంటే ఏమిటి?" అని అడిగాయి. "బెల్లం గురించి వినడమే కాని చూడలేదు" అన్నది తలి చీమ.

చీమల వార్షిక మహాసభ జరుగుతోంది. "బెల్లం కొట్టిన రాయి" అని ఒక గ్రంథంలో ఉందన్నాడొక ముసలి చీమ. "రాయి అంటే అర్థం అవుతోంది. కొట్టిన అంటే ఏమిటి?" అడిగాడొక కుర్ర చీమ. అదీ తెలిస్తే, బెల్లం అంటే ఏమిటో తెలుస్తుంది - అన్నది ఒక మేథావి చీమ. "ఇప్పటికి మటుకు ఇలాగే భట్టీయం వేద్దాం" తీర్మానించారు సభాసదులందరూ.

మరి కొన్ని తరాలు గడిచాయి. పెద్ద చీమలు పిల్ల చీమల్ని రోజూ "బెల్లం కొట్టిన రాయి" చదవాలంటున్నాయి. చిన్న చీమలు కళ్ళు మూసుకొని చదివినట్లు నటిస్తున్నాయి. ముసలి చీమలు వినిపించలేదంటే, మనసులో చదివామని బుకాయిస్తున్నాయి.

మరి కొన్ని రోజులకి మళ్ళీ సమావేశం. "బెల్లం అనేది అబద్ధం, ఇది కొందరి స్వార్థ పరుల కల్పన" అన్నాడొక విప్లవ చీమ. "బెల్లం అనేది ఉన్నా, అది రాయిని కొట్టుతుందనుకోను" అంది మరో మేథావి చీమ. "కొట్టటం" అంటే, అడిగాడు అనుభవం లేని కుర్ర చీమ. "అది తెలియకనే చస్తున్నాం" అన్నాడొక నిజాయితీ చీమ. "బెల్లం కోరిన రాయి అయి వుంటుంది" అన్నాడొక భాష్యకారుడు చీమ. "అరటిపండు వలిచి పెట్టినట్లు చెప్పారు" సంఘటితంగా ఆనందం ప్రకటించాయి చీమలు.

మరి కొన్ని తరాలు గడిచాయి. చిన్న చీమలు ముద్దు ముద్దు మాటలతో "బెల్లం కోరిన రాయి" అని అప్పజెప్పేస్తున్నాయి. తల్లి దండ్రి చీమలు గర్వంగా చూస్తున్నాయి. వృద్ధ చీమలు ఆనంద బాష్పాలు రాలుస్తున్నాయి.

బెల్లంతో చేసిన బూరెలు తింటూ భగవాన్ మాత్రం నవ్వుకొన్నాడు.

(మనందరికీ కొంచెం సంస్కృతం వస్తే మంచిది అని నేనంటే, ఎందుకు రావాలి?, ఏమిటి అందులోని మంచి? అని వివరిస్తూ వ్యాసం రాయమన్నారు మిత్రులు. ఈ గల్పిక ద్వారా ఆ విషయాన్ని ప్రతిపాదిస్తున్నాను. - రచయిత)